# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 175 | పేజీలు : 8 | వెల : రూ.2/- మంగళవారం 21 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





## సమస్యలపై గిరిజన సంఘాలతో
# త్వరలో ప్రభుత్వం చర్చలు

● గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం...ఆందోళన పడకండి! ● జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు చూస్తున్నాం ● ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన జీవో నెంబర్ 3ను గత ప్రభుత్వం పరిరక్షించలేకపోయింది

● జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లా ● బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు...అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు ● ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సిఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, మన జనప్రగతి జూలై 20:**రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం మిగతా2లో...

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

● దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

● విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం

● పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 20:**పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ మిగతా2లో...

# కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

### తన జీవితమే అందుకు ఉదాహరణ: మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు,మన జనప్రగతి జూలై 20:**చదువుతో పేదరికాన్ని జయించవచ్చని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. తాను ట్యూషన్స్ ప్రారంభించి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో షైనింగ్ స్టార్ అవార్డ్స్ – 2026లో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు, బహుమతులు పంపిణీ చేశారు. మిగతా2లో...



# క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

### మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచే విధి నిర్వహణ

**అమరావతి, మన జనప్రగతి జూలై 20:** ఇటీవల కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అధికారిక కార్యక్రమాలకు అందుబాటులోకి రావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పిఠాపురం, పార్వతీపురం మన్యం జిల్లాలోని పెదపెంకి గ్రామం, రాజమహేంద్రవరం మిగతా2లో...

## 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం
# విమానాశ్రయం ప్రారంభం

నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు అని, శ్రీనివాస్



**విజయనగరం,మన జనప్రగతి జూలై 20:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లను అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్,

మిగతా2లో...

# ఎపి యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి

### పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



2లో



# విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

షైనింగ్ స్టార్స్ 2026 కార్యక్రమంలో మంత్రి అనగాని

**తిరుపతి,మన జనప్రగతి జూలై 20:**విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం తిరుపతిలో జరిగిన షైనింగ్ స్టార్స్ 2026 కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో విద్యా వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక

మిగతా2లో...

# జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

పరీక్షల నిర్వహణా లోపాలపై ప్రశ్నలు

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు

పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేత


దీక్ష విరమిస్తున్నట్లు సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడి



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 20:** నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు మిగతా2లో...

## ఆక్వా, పొగాకు రైతులను
# ఆదుకోవాలి

### - కేంద్రమంత్రికి రాష్ట్ర మంత్రుల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 20:** రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రంగాల అభివృద్ధి, రైతులు, మత్స్యకారుల సంక్షేమం కోసం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో కలసి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి, మత్స్యశాఖ మంత్రులను కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కార్మికులు, హేచరీలు, మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
21 - 07 - 2026

# సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోవడం వల్ల సుప్రీం కోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం." అని అన్నారు.త్వరలో గిరిజన సంఘాలతో చర్చలుస్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు... గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి... ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు...ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. గత పాలకులు తమ అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని....ఈ విషయంలో ఎవరి ట్రాప్ లోనూ పడవద్దని సిఎం సూచించారు. అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని... ఇదే విషయాన్ని గిరిజన సంఘాలకు చెప్పాలని సిఎం సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా...గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయి అభివృద్ధి జరిగినప్పుడే...వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతోందన్నారు. గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్దంగా ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సిఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించనున్నారు. సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేసిన విక్రమ్–1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్–1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్–1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు హోం మంత్రి కీలక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రధాని పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. గత పదేళ్ల వరకు ఒక సాధారణ గ్రామంగా ఉన్న భోగాపురం ఇప్పుడు రూపురేఖలు మారాయి. విమానాశ్రయం ఏర్పాటుతో నేడు ఉత్తరాంధ్ర ప్రగతికి మణిహారం కాబోతోంది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెదేపా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించింది. అప్పట్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవ, ఎన్డీయే ప్రభుత్వం అనుమతితో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అప్పటి వైకాపా ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. 2023 మే 23న ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఏడాదికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కేంద్రంలో పౌరవిమాన యాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగింది. సుమారు రెండున్నరేళ్లలో విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యింది. ఆగస్టు ఒకటిన ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఉత్తరాంధ్ర వాసుల సహా రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉపాధికి ఈ ప్రాజెక్టు ఊతమివ్వనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వివిధ సందర్భాల్లో పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామిక, రవాణా రంగాలు భావితరాలకు బంగారు భవిత అందించనున్నాయి. 136 ఎకరాల్లో జీఎంఆర్–మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీ విమానాశ్రయానికి అనుబంధంగా ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడ పైలట్లు, రక్షణ రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం సహా ఇతర భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ప్రధానమైన అభివృద్ధి కేంద్రంగా మారనుంది. త్వరలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సముద్ర సంపద, ఔషధాల తయారీ ముడిసరకుల ఎగుమతులు.. ఇక్కడకు అవస రమైన సరకుల దిగుమతులతో రాష్ట్ర ప్రధాన పారిశ్రా మిక, రవాణా కేంద్రంగా అవతరించనుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు, పర్యాటకులతో భారత విమానయాన పరిశ్రమలో కీలక పాత్ర పోషించనుంది. విమానాశ్రయం చుట్టూ ఒక నగరాన్ని నిర్మించే ప్రతిపాదన ఉంది. ఇందులో పారిశ్రామిక మండలం, విమానయాన, విద్య, ఆరోగ్య సంరక్షణ మండలాలు నెలకొల్పాలని యోచిస్తున్నారు. 139 ఎకరాల్లో జీఎంఆర్ టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పలుమార్లు సందర్శించి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

# ఎపి యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి

**జైపూర్,మన జనప్రగతి జూలై 20:**ఆంధ్రప్రదేశ్‌లోని యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పర్యటన కొనసాగుతుంది. సోమవారం టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోడ్‌తో మంత్రి దుర్గేష్ సమావేశమయ్యారు. టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఏపీ యువతకు టూర్ గైడ్స్‌గా ట్రైనింగ్ ఇవ్వాలని ఈ సందర్భంగా రాథోడ్‌ను ఆయన కోరారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలంటూ రాథోడ్‌ను కందుల దుర్గేష్ ఆహ్వానించారు. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేందుకు త్వరలో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తారని తెలిపారు. మరికొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాల్లో ఏఐ డిజిటల్ గైడ్స్‌తో పాటు ప్రొఫెషనల్ టూర్ గైడ్స్ అందుబాటులోకి వస్తారని మంత్రి దుర్గేష్ వివరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10 వేల మంది యువతకు శిక్షణ అందించాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ భావిస్తున్నారు.

# జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. అయితే.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలు లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేసింది సీజేపీ. నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది. సీబీఎస్ఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయూఈటీ పరీక్షల్లో జాప్యం వంటి పరిణామాలు వంటివి కూడా వైఫల్యాలేనని ఆరోపించింది. పరీక్షల వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టడంలో ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని సీజేపీ పేర్కొంది. ఇకపోతే ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించారు. సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సోనమ్.. తన దీక్షను విరమించారు. దీంతో గత 23 రోజులుగా ఆయన చేస్తున్న దీక్ష ముగిసినట్లు అయింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, విద్యావ్యవస్థలోని లోపాలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. సోనమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఆదివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

# కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. యువనేత నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఉద్ఘాటించారు. విద్యార్థులు ఈ మార్పులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపునిచ్చారు.తన కష్టంతోనే ఈ స్థాయికి వచ్చానని మంత్రి నారాయణ ప్రస్తావించారు. తాను పదోతరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయ్యానని వెల్లడించారు. పదోతరగతి ఫెయిల్ తనలో పట్టుదల పెంచిందని చెప్పుకొచ్చారు. డిగ్రీ మూడేళ్లల్లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచానని తెలిపారు. స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని వెల్లడించారు. వీఆర్సీలో పార్టు టైం లెక్చరర్‌గా రూ.40ల జీతానికి పనిచేశానని వివరించారు. మూడు నెలలకు గానూ రూ.120ల జీతం ఇస్తే తాను తీసుకోలేదని వెల్లడించారు. ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం ఇచ్చినా తాను రాజీనామా చేశానని ప్రస్తావించారు.

# క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

(మొదటి పేజీ తరువాయి)

పుష్కర ఘాట్ల సందర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయి పర్యటనల సందర్భంగా జనసమూహం మధ్యకు వెళ్లిన సందర్భంలో శస్త్ర చికిత్స చేసిన భుజానికి ఏ మాత్రం అసౌకర్యం కలిగినా గాయం తిరగబెడుతుందని, అలాంటి పరిస్థితి ఏర్పడితే మరోమారు సరిచేయడం కూడా క్లిష్టతరమవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. ఎడమ భుజానికి కూడా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కనీసం మరో రెండు వారాల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలకు దూరంగా ఉండాలని వైద్యులు ఉప ముఖ్యమంత్రివర్యులకు సూచించారు. వైద్యుల సలహా మేరకు క్షేత్ర స్థాయి పర్యటనల షెడ్యూలు మార్చాలని కార్యాలయ అధికారులకు సూచనలు చేశారు.అదే సమయంలో అధికారిక కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి విధులు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

# విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

వసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ల ద్వారా ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యా సామగ్రిని అందిస్తున్నామని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో పోషకాహారాన్ని పెంచి విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో నిలిచిపోయిన ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించామన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని చెప్పారు. 'హెల్తీ– వెల్తీ– హ్యాపీ ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ఈ నెల 24న జరిగే పేరెంట్–టీచర్ సమావేశాలను తల్లిదండ్రులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేడు విద్యార్థులపై పెట్టుబడి పెడితేనే రేపటి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతిభను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. విద్య ద్వారా తిరుపతి జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. తిరుపతిని ఆధ్యాత్మికంగా, క్రీడలపరంగా, పారిశ్రామికంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు ఆధారపడి జీవిస్తున్నారని, అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు తగ్గడం, ఫీడ్ ధరలు పెరగడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించి దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నమోదిత రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు మాత్రమే 2021 విధానాన్ని అనుసరించి పరిమిత స్థాయిలో జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నెక్కల్లు గ్రామంలో జీవో .146 ద్వారా 7.89 ఎకరాల భూమిని కేటాయించిందని, డీపీఆర్, పరిపాలనా, ఆర్థిక అనుమతులు, నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 2028 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత రొయ్యల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 80 శాతం, దేశ సముద్ర ఉత్ప త్తుల ఎగుమతుల్లో 34 శాతం (సుమారు ?21,246 కోట్లు) ఉందని, రాష్ట్రంలో 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు ప్రత్యక్షంగాను, 30 లక్షల మందికి పైగా పరోక్షంగాను ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 2025లో అమెరికా విధించిన అధిక టారిఫ్‌లతో భారత రొయ్యలపై మొత్తం సుంకం 58 శాతానికి చేరడంతో సుమారు రూ. 25,000 కోట్ల నష్టం వాటిల్లిం దని, ఎగుమతి ఆర్డర్లలో దాదాపు 50 శాతం రద్దు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నా రు. భారత్, అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం, అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో టారిఫ్ 10 శాతానికి తగ్గడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ రొయ్యల రంగానికి మరింత ఆర్థిక తోడ్పాటు అవసరమని, రిజిస్టర్డ్ రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు పరిమిత పరిమాణంలో జన్యు మార్పిడి సోయాబీన్ మీల్ దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ప్రయోజనాలు లేక పోవడం వల్ల భారత ఎగుమతిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని, జింబాబ్వే, టాంజానియా వంటి దేశాల నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోందని వివరించారు. రైతులు, ఎగుమతిదారుల ప్రయోజ నాల ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ వినతులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# అయోధ్య విరాళాలపై సీనియర్ అధికారులతో దర్యాప్తు

- వ్యవహారాన్ని

## రాజకీయ కోణంలో చూడొద్దన్న సుప్రీం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 20:**అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయ విరాళాలు దారిమళ్లాయనే ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. ఈ కేసును స్థానిక పోలీసుల ద్వారా కాకుండా సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ జరిపే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. ఎస్ఐటీ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు స్వీకరించి కోర్టుకు తెలియజేస్తామని ఎస్‌జీ వెల్లడించారు. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పిటిషనర్లను హెచ్చరించింది. కోర్టులు రాజకీయ వేదికలు కావన్న ధర్మా సనం.. ఈ ఆరోపణలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరగడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలకు సంబంధిం చిన అన్ని రికార్డులను భద్రపరచాలని కోర్టును కోరారు. అలాగే విరాళాలకు సంబంధించిన రసీదులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

మనజనప్రగతి

21 - 07 - 2026

# ప్రజల సమస్యలకు వారు సంతృప్తి చెందేలాగా పరిష్కారాలు అందించాలి

**● జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 20:–** ప్రజల సమస్యలకు సంతృప్తి చెందేలా పరిష్కారాలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించటం ప్రభుత్వం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కు ఆలస్యం లేకుండా, ప్రతి అర్జీ ని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే వారి సమస్యలకు ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. అపరిష్కృత వినతులన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించి, ఎలాంటి అర్జీలు మిగిలి పోకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం: అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 20:–** కర్నూలు కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 130 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఐలు శివశంకర్,రామాంజులు, మస్తాన్ వలి పాల్గొన్నారు.

# తైక్వాండో పోటీలను ప్రారంభించిన డాక్టర్. శంకర్ శర్మ



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 20:–** తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలను కర్నూలు కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ ప్రారంభించారు. సోమవారం కిడ్స్ వరల్డ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. తైక్వాండో లో యోగా, ధ్యానం, వ్యాయామం ఉంటుందని అందువల్ల విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అందుకే గత 25 సంవత్సరాల నుంచి క్రీడలను తనవంతు కృషిగా ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. మంచి ఆహారంతో పాటు మంచి అలవాట్లు కలిగి ఉండాలని డాక్టర్. శంకర్ శర్మ సూచించారు. క్రీడాకారులకు డాక్టర్. శంకర్ శర్మ క్రీడా సామగ్రి అందజేశారు. ఈకార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పదో తరగతి ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు

**● పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 20:–** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని ఎఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన నంద్యాల జిల్లా షైనింగ్ స్టార్స్ అవార్డ్–2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్.ఎం.డి. ఫరూక్,జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మరియు విద్యాశాఖ అధికారులతో కలిసి,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అనేక ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించడం ఎంతో అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు రోజుల అగ్నిహోత్రం ద్వారా వర్షాలు కురిసేలా చేయచ్చు

**వర్షాలు కురవకపోతే అగ్ని హోత్రానికి అయ్యే ఖర్చు మేమే చెల్లిస్తాం**

**కృత్రిమ వర్షాల ప్రయోగంపై గజ్జల రమణారెడ్డి సందేశం**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 20:–** మూడు రోజుల పాటు అగ్నిహోత్రం నిర్వహించడం ద్వారా కృత్రిమ వర్షాల కురిపించవచ్చు అని పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు గజ్జల రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి యజ్ఞాల ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించ వచ్చు అని శాస్త్రాలు చెబుతున్నాయి అని అన్నారు. అగ్ని హోత్రం నిర్వహించడం రాయలసీమకి శ్రీరామ రక్ష అని అన్నారు. ప్రపంచంలో ఇప్పటికీ రెండు దేశాలు యజ్ఞాలు చేస్తూ కృత్రిమ వర్షాలు కురిపించడం జరుగుతోంది అని అన్నారు. కృత్రిమ వర్షాలు కురిపించ డంతో కరువు ప్రాంతమైన రాయలసీమను సశ్యామ లం చేయచ్చు అన్నారు. మన రాయలసీమ జిల్లాకు విస్తారంగా వర్షాలు రావాలి అంటే అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతాలైన




పెనుగొండ,హిందూపూర్ ప్రాంతంలో అగ్ని హోత్రం చేయాలని అన్నారు. సెప్టెంబర్ నెలలో అయితే నెల్లూరు జిల్లాలో చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో కూడా చేయగలిగితే కూడా కృత్రిమ వర్షాలు కురిపించ డం జరుగుతుంది అన్నారు. వర్షాలు కురవకపోతే అందుకు అయ్యే ఖర్చు కూడా మేమే చెల్లిస్తామని అన్నారు. రాజకీయ నాయకులు ముందుకు వచ్చి అగ్ని హోత్రానికి ఖర్చు చేస్తే మేము చేసి కృత్రిమ వర్షాలు కురిపించాలా చేస్తామని అలా చేయలేకపో తే ఖర్చు అంతా వెనక్కి ఇస్తామన్నారు. అందుకు అయ్యే ఖర్చు అవసరమైన సామగ్రి, విధానం, సమ యాల వివరాలను అందులో పేర్కొన్నారు. ఆవు నెయ్యి, పచ్చ కర్పూరం, హోమ ద్రవ్యాలు, సమిధలు, ఆవు పాలు, గోమూత్రం తదితర పదార్థాలను ఉపయోగించా ల్సి ఉంటుందని తెలిపారు. అగ్నిహోత్రాన్ని మూడు రోజుల పాటు వరుసగా ఉదయం 5 గంటల నుంచి 9 గంటలలోపు లేదా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటలలోపు నిర్వహించాలని సూచించా రు. గాయత్రీ మంత్రంతో కార్యక్రమాన్ని నిర్వహిం చాలని పేర్కొన్నారు. అదేవిధంగా నైరుతి రుతుపవనాలు, ఈశాన్య రుతుపవనాల కాలాల్లో ఈ ప్రయోగం నిర్వహిస్తే స్థానికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని సందేశంలో పేర్కొన్నారు. అయితే అగ్నిహోత్రం లేదా ఇలాంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా వర్షపాతం నేరుగా కలుగుతుందనే విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు వాతావరణ శాస్త్ర నిపుణుల పరిశీలన, ఆధారాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. హోమ ద్రవ్యాలు లభించే ప్రదేశంగా భరత్‌నగర్ బస్‌స్టాప్ ఎదురుగా ఉన్న గాయత్రి పరివార్‌ను పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు రమణారెడ్డి, రామలింగం, ఎల్లారెడ్డి తదితరులను సంప్రదించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# నేనున్నా-బాధితులకు మంత్రి నారాయణ బరోసా .

**● యనమలవారి వీధిలో కూలిన పాత ఇంటి స్లాబు ● ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసిన రెస్క్యూ బృందం. ● ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి నారాయణ**

**నెల్లూరు మన జనప్రగతి జూలై 20:–** నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 ఏళ్ల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హుటాహుటిన ఘటనాస్థలికి



చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్,మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్ ,కో–క్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు,రేవతి ,ముజీబ్,గౌస్మస్తానమ్మ,షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు

# రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ యాదవ్‌కు కీలక బాధ్యతలు

**హక్కుల పరిరక్షణ.. సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందించాలని రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పిలుపు**

**పులివెందుల రూరల్ మన జనప్రగతి జూలై 20 : –** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి గౌరవం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలనే లక్ష్యంతో రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌జేడబ్ల్యూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చెల్లుబోయిన గంగాధర్ యాదవ్ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకులు కె. శ్రీనివాసులు సోమవారం కడప జిల్లా కేంద్రంలో నియామక పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే నాయకత్వాన్ని గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాసులు మాట్లాడుతూ మీడియా రంగంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్



యాదవ్ సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించడంతో పాటు జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. అలాగే జర్నలిస్టులపై జరిగే వేధింపులు, అక్రమ కేసులు, వృత్తి సంబంధిత సమస్యలపై సంఘం తరఫున ముందుండి పోరాడాలని, యువ జర్నలిస్టులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ సంఘం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, రాష్ట్రంలోని ప్రతి జర్నలిస్టుకు సంఘం అండగా నిలిచేలా కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, సభ్యత్వ బలోపేతం, సంఘ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సమష్టిగా పనిచేస్తానని చెప్పారు. అనంతరం గంగాధర్ యాదవ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసులను దుశాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిగా శ్రీనివాసులు కూడా గంగాధర్ యాదవ్‌ను దుశాలువాతో సన్మానించి నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొని గంగాధర్ యాదవ్ నియామకాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఆయన నాయకత్వంలో రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతమై, జర్నలిస్టుల హక్కుల సాధనలో కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో వైశ్యులు కీలక పాత్ర పోషించాలి: ఎస్‌పీ డి. శ్రీనివాస్

**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 20:–** గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ (జీవీబీఎల్) ప్రథమ వార్షికోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్‌పీ డి. శ్రీనివాస్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పీ డి. శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో వైశ్యులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. చికోటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వ్యాపార చతురత, కష్టపడే తత్వంతో వైశ్యులు దేశ జీడీపీ వృద్ధికి దోహదపడుతున్నారని, దాతృత్వ కార్యక్రమాల్లో కూడా ముందుండాలని కోరారు. జీవీబీఎల్ వ్యవస్థాపకుడు రాజశేఖర్ మంచి మాట్లాడుతూ, వైశ్య వ్యాపారవేత్తలను ఒక వేదికపైకి తీసుకువచ్చి వ్యాపార అభివృద్ధి, స్టార్టప్‌లు, జాయింట్ వెంచర్లకు ప్రోత్సాహం అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జీవీబీఎల్ ప్రతినిధులు, వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.






## సైబర్ నేరాలపై విద్యార్థినులకు ఎస్ఐ హారిక అవగాహన

**సిద్ధవటం మన జనప్రగతి, జూలై 20:–** ప్రతి విద్యార్థిని సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్ధవటం ఎస్ఐ హారిక సూచించారు. కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం సిద్ధవటంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హారిక మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణతో పాటు అప్రమత్తత కూడా అవసరమని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–100కు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. హాస్టల్ వార్డెన్ లీలావతి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ గడువు మరో 10 రోజులు పొడిగింపు

**- డిఎల్వోలతో తహసీల్దారు విజయ్ కుమార్**



**సిద్ధవటం, మన జనప్రగతి జూలై 20:–** ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ గడువును మరో 10 రోజుల పాటు పొడిగించినట్లు సిద్ధవటం మండల తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్యుమరేషన్ గడువును మరో 10 రోజులు పొడిగించినట్లు తెలిపారు. డీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## జూదంపై పోలీసుల దాడి.. నలుగురు అరెస్ట్, నగదు స్వాధీనం



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 20:–** మండలంలోని వంతాటిపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.14,066 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిద్ధవటం ఎస్ఐ హారిక తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ, కడపకు చెందిన నలుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఘటన స్థలంలో జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ. 14,066 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

**- యూట్యూబర్‌కు తీవ్ర గాయాలు**



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 20:–** కడపచెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కళాశాల సమీపంలోని కోతుల మోరి వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధవటం మండలం మాధవరం–1 గ్రామపంచాయతీ వెంకటేశ్వరాపురం గ్రామానికి చెందిన '999 ఇండియా' యూట్యూబర్ జయకృష్ణ తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఐ హారిక తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. జయకృష్ణ కడప నుంచి కారులో తన స్వగ్రామమైన మాధవరానికి వెళ్తుండగా, రాజంపేట వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హారిక తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**● జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా**



**కడప టౌన్ మన జనప్రగతి జూలై 20:–** ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా.. డిఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి లతో కలిసి.. ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆమె, ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు సులభంగా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా కనిపించే ప్రదేశాల్లో క్యూ ఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, పొంతనలేని నివేదికలు సమర్పించకుండా వాస్తవ సమాచారంతో నివేదికలు అందించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, & ఆర్టిఐ ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా బి. రవి నియామకం



**కడప మన జనప్రగతి జూలై 20:–** ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, & ఆర్టిఐ రాష్ట్ర కమిటీ సభ్యులుగా తిరుపతి కి చెందిన సీనియర్ న్యాయవాది బి. రవి నియమితులయ్యారు. ఈ మేరకు 12 మంది జాబితాతో కూడిన లిస్టును ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విడుదల చేసింది. గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందిస్తున్న బి. రవి తిరుపతి జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆయన సేవలను గుర్తించి, ఏపీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ & ఆర్టిఐ రాష్ట్ర కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించి సముచిత స్థానం గౌరవాన్ని ఇచ్చింది.ఈ సందర్భంగా బి. రవి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి, రాష్ట్ర కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కి, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కి, ప్రియాంక గాంధీ కి, ఏపీసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కి, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కి, ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్ కి, లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వడ్డే సోమశేఖర్ కి హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని బి. రవి తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీలకు వెంటనే పని కల్పించాలి

**- వ్యవసాయ కార్మిక సంఘం వినతి**



**పత్తికొండ, మన జనప్రగతి, జూలై 20:–** ఉపాధి హామీ కూలీలకు వెంటనే పనులు కల్పించి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం తాలూకా అధ్యక్షుడు వై. వెంకటరామిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి మాట్లాడుతూ, వర్షాభావంతో వ్యవసాయ పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. VBG రాంజీ పథకం కింద పనులు కల్పించాలని, పని లేని రోజులకు ప్రకటించిన భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పనిస్థలాల్లో మెడికల్ కిట్లు, అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని, మేటీల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గురుదాసు, కారన్న, నరసింహులు, నెట్టికంటయ్య, రామాంజనేయులు, కాశి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి ఏజీపీగా ఆర్. వీరభద్రయ్య నియామకం

**ఘనంగా సన్మానించిన తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పకీరయ్య**



**లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి జూలై 20 :–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు, లక్కిరెడ్డిపల్లి మండలం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజిపి)గా న్యాయవాది ఆర్. వీరభద్రయ్య (బి.ఏ., బి.ఎల్.) నియమితులయ్యారు. గతంలో ఉన్న లాయర్ బాలాజీ రెడ్డిని విధుల నుండి తొలగించి, వారి స్థానంలో వీరభద్రయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ఈ నియామకం జరిగిందని స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్. వీరభద్రయ్యను పలువురు నాయకులు మరియు న్యాయవాదులు శాలువాతో ఘనంగా సన్మానించి, తమ ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వేల్పుల సిద్దయ్య, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పకీరయ్య, టిడిపి సీనియర్ నాయకులు ముక్తి యార్ అహ్మద్, మహబూబ్ భాష తదితరులు పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించిన నాయకులకు ఆర్. వీరభద్రయ్య ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన పులివెందుల డీఎస్పీ బి. మురళి



**వేముల మన జనప్రగతి జూలై 20:–** పులివెందుల కడప రోడ్డులోని కొత్తపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి పులివెందుల డీఎస్పీ బి. మురళి సకాలంలో స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర రక్తస్రావ గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న డీఎస్పీ బి. మురళి ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపారు. బాధితుడికి ప్రథమ చికిత్స అందించడంతో పాటు తాగునీరు ఇచ్చి ధైర్యం చెప్పారు.అనంతరం తన అధికారిక వాహనంలోనే ప్రశాంత్‌ను వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వేగంగా తరలించి, వైద్యులతో మాట్లాడి వెంటనే చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ సకాలంలో స్పందించడంతో బాధితుడికి త్వరగా వైద్య సేవలు అందాయని స్థానికులు తెలిపారు.డీఎస్పీ బి. మురళి చూపిన సమయస్ఫూర్తి, సేవాభావం, మానవతా దృక్పథాన్ని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో పాటు స్థానిక ప్రజలు అభినందించారు. ప్రజలకు భరోసాగా నిలుస్తూ పోలీసు అధికారులు చూపుతున్న మానవీయ కోణానికి ఈ ఘటన మరో నిదర్శనంగా నిలిచింది.

## మహిళల భద్రతకు పోలీస్ శాఖ అగ్ర ప్రాధాన్యం: పులివెందుల అర్బన్ సి.ఐ శ్రీరామ్



**పులివెందుల టౌన్ మన జనప్రగతి జూలై 20:–** మహిళల భద్రతను అత్యంత ప్రాముఖ్యతగా పరిగణించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాలు, పులివెందుల డి.ఎస్.పి బి. మురళి పర్యవేక్షణ లో పులివెందుల అర్బన్ పరిధిలోని జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కాలేజ్ లో సోమవారం మహిళా రక్షణ, శక్తి యాప్, సైబర్ భద్రత, అత్యవసర సేవలు వంటి కీలక అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పులివెందుల సి.ఐ శ్రీరామ్ మాట్లాడుతూ "మహిళలు సంక్షోభంలో చిక్కుకునే ప్రతి సారి పోలీస్ శాఖ వారి పక్కనే నిలబడే శక్తివంతమైన రక్షణ వ్యవస్థగా 'శక్తి యాప్' మరియు 112 అత్యవసర సేవలు పనిచేస్తున్నాయి." అని స్పష్టం చేశారు.SOS నొక్కిన క్షణంలోనే నియంత్రణ గదికి అలర్ట్ చేరి, 10 నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరేలా సదుపాయం అమలులో ఉందని తెలిపారు.హెల్ప్‌లైన్‌లే మహిళల రక్షణ ఆయుధాలు 112, 1091, 181, 1930 వంటి కీలక హెల్ప్‌లైన్ నంబర్లు ప్రతి మహిళ చేతిలో ఉండాల్సిన రక్షణ ఆయుధాలు అని తెలిపారు.ప్రమాదాలను ముందుగానే గుర్తించే పద్ధతులు, స్వీయ రక్షణ టెక్నిక్స్ గురించి వివరించారు.సైబర్ భద్రత అప్రమత్తతే రక్షణ.మహిళలను లక్ష్యంగా చేసుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు, ఫేక్ లింకులు, UPI/OTP ఫ్రాడ్స్, సోషల్ మీడియా వేధింపులు గురించి పులివెందుల సి.ఐ శ్రీరామ్ తెలిపారు.డిజిటల్ ప్రపంచంలో ప్రతి క్లిక్ ముందు ఆలోచన అప్రమత్తతే మీ రక్షణ" అని విద్యార్థినులకు స్పష్టం చేశారు. 'శక్తి' యాప్ మీ చేతిలోనే పోలీస్ రక్షణ. అధికారులంతా విద్యార్థినులకు శక్తివంతమైన సందేశం ఇచ్చారు."శక్తి " యాప్ మీ చేతిలోని మొబైల్ లో ఉంటేడ పోలీస్ రక్షణ మీ వెంటే !" అని పులివెందుల సి.ఐ శ్రీరామ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో పులివెందుల పోలీస్ స్టేషన్ ఎస్.ఐ లు మధుసూదన్ రెడ్డి, తిమోతి, కాలేజ్ అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో జె.ఎన్.టి.యు విద్యార్థినులు పాల్గొన్నారు.


## హాజీ బేపారి బషీర్ ఖాన్ ప్రథమ వర్ధంతి

**సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు**

**తండ్రి ఆశయ సాధనకై కృషి చేస్తానన్న తనయుడు బేపారి మహమ్మద్ ఖాన్**



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జులై 20 :–** ప్రముఖ సేవకులు, కీర్తిశేషులు హాజీ బేపారి బషీర్ ఖాన్ గారి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతికంగా దూరమై ఏడాది గడుస్తున్నప్పటికీ, ఆయన చేసిన సేవలు ఎల్లప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన కుమారుడు బేపారి మహమ్మద్ ఖాన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.పెద్దాయన బషీర్ ఖాన్ కులమతాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించేవారని మహమ్మద్ ఖాన్ కొనియాడారు. పండుగలు, పర్వదినాల సమయంలో మధ్యతరగతి కుటుంబాలకు వస్త్రదానం చేయడం ఆయన ఒక ఆనవాయితీగా కొనసాగించారని పేర్కొన్నారు. అంతేకాకుండా, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఈద్గా, ముస్లిం మైనార్టీల పేదేంటి బిడ్డల వివాహాల కోసం శాది ఖాన నిర్మాణం,మసీదులు, దేవాలయాలు, స్మశాన వాటికల అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని వివరించారు. రాజకీయంగా కూడా ప్రజల పక్షాన నిలబడి, ప్రజా శ్రేయస్సు కోసమే ఆయన అహర్నిశలు శ్రమించారన్నారు.తమ తండ్రి చూపిన స్ఫూర్తితో, ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను ఎక్కడా ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తానని బేపారి మహమ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమాజ హితం కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక



## షైనింగ్ స్టార్ అవార్డు" అందుకోవడం పాఠశాలకు గర్వకారణం

**• జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ), హెచ్ఎం జి. సమీవుల్లా**




**రామాపురం మన జనప్రగతి జులై 20:–** 2026 వ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాయదించిన ప్రతిభావంతుల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు" అందుకోవడం పాఠశాలకు ఎంతో గర్వకారణం అనిజెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ), హెచ్ఎం జి. సమీవుల్లా తన సంతోషాన్ని వెలిబుచ్చారు అన్నమయ్య జిల్లా, రామాపురం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ), నీలకంఠరావుపేట పాఠశాలకు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని సయ్యద్ సబీహా ప్రతిష్ఠాత్మకమైన "షైనింగ్ స్టార్ అవార్డు" అందుకోవడం పాఠశాలకు ఎంతో గర్వకారణంగా నిలిచింది. అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచినందుకు గాను అన్నమయ్య జిల్లా గౌరవ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సయ్యద్ సబీహాకు షైనింగ్ స్టార్ అవార్డు, ప్రశంసా పత్రం, అలాగే రూ. 20,000 నగదు బహుమతి అందజేయబడింది. ఈ ఘనత ఆమె నిరంతర కృషి, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనం మాత్రమే కాకుండా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి కూడా ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సమీవుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘౌస్‌పీర్, వాణి, కరీముల్లా, సునీర్, మజ్హరుల్ హక్, మహబూబ్ బాషా మరియు తల్లిదండ్రులు సయ్యద్ సబీహాను హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె సాధించిన ఈ విశిష్ట విజయం పాఠశాలకు మంచి పేరు తీసుకురావడమే కాకుండా, ఇతర విద్యార్థులకు కూడా విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సయ్యద్ సబీహా మరెన్నో విజయాలు సాధించి, పాఠశాలకూ, తల్లిదండ్రులకూ, జిల్లాకూ మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని పాఠశాల కుటుంబం హృదయపూర్వకంగా ఆకాంక్షించింది.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం

**• నీట్ లీకేజీపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం**




**పత్తికొండ, మన జనప్రగతి, జూలై 20:** –నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోనం వాంగ్‌చుక్ అరెస్టును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈశ్వర్‌రెడ్డి భవనం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుడు మధు మాట్లాడుతూ, వరుసగా రెండో ఏడాది కూడా నీట్ పేపర్ లీకేజీ జరగడం విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు దస్తగిరి, సీఐటీయూ మండల అధ్యక్షుడు గోపాల్, వెంకటేశ్వర్లు, చంద్ర, బుజులు, నరసన్న, శిఖామణి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరులు నిరవధిక పెన్‌డౌన్ సమ్మె

**• జీఓ 396 రద్దు చేయాలని డిమాండ్**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 20:–** స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలోని దస్తావేజు లేఖరులు నిరవధిక పెన్ డౌన్ సమ్మె చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన జీఓ 396ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 20 నుంచి 31 వరకు నిరవధిక పెన్ డౌన్ సమ్మె ప్రకటించారు. రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ప్రైవేటీకరణను ఆపాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ఉప సంహరణ, ప్రజల ఆస్తులకు బధ్రత కల్పించాలని కోరారు. అలాగే దస్తావేజు లేఖరుల లైసెన్స్ లను పునరుద్ధరించి లేఖరులు, స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్ల జీవనోపాధిని కాపాడాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన పిపిపి విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిటిపి ఆపరేటర్లు తదితరులు రోడ్డున పడే దుస్థితి ఉందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నేతి శంకర్, రెడ్డయ్య, మనోహర్ రెడ్డి, నరసింహ, పవన్ కుమార్, నాగేంద్ర, షాబుద్దీన్ తదితర వెండర్లు, డిటిపి ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు

**- షైనింగ్ స్టార్స్2026' అవార్డు గ్రహీతల స్ఫూర్తిదాయక అభిప్రాయాలు**




**మదనపల్లె, మన జనప్రగతి, జూలై 20:–** ప్రభుత్వ ప్రోత్సాహం తమ ఉన్నత విద్య, లక్ష్య సాధనకు ఎంతో దోహదపడుతోందని 'షైనింగ్ స్టార్స్2026' అవార్డు గ్రహీతలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్2026', 'మై స్కూల్‌మై ప్రైడ్' కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా పీలేరు మండలం రామానాయక్ తాండాకు చెందిన మానస భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావడమే తన లక్ష్యమని తెలిపింది. బి.కొత్తకోటకు చెందిన సాయి వెన్నెల కూడా ఐఏఎస్ కావాలనేది తన తండ్రి కోరిక అని, దాన్ని నెరవేర్చేందుకు కష్టపడి చదువుతానని చెప్పింది. మదనపల్లెకు చెందిన తస్మియా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎదిగి సమాజానికి సేవ చేయాలనేది తన లక్ష్యమని పేర్కొంది. మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

## భూముల సమస్యకు చట్టబద్ధ పరిష్కారం: చమర్తి జగన్ మోహన్ రాజు

**• దళిత రైతులతో ముఖాముఖి సమావేశం**

**• ఆక్రమిత భూములను పేదలకు పంపిణీ చేస్తామని హామీ**



**సిద్దవటం, మన జనప్రగతి, జూలై 20:–** పెద్దపల్లె సర్వే నం.937 భూముల సమస్యపై రాజంపేట టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆదివారం స్పందించారు. రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి చలపాటి చంద్ర ఆధ్వర్యంలో సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడకు చెందిన దళిత రైతులతో ఆయన నివాసంలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు చలపాటి చంద్ర ఆధ్వర్యంలో కార్యకర్తలు చమర్తి జగన్ మోహన్ రాజుకు డప్పు వాయిద్యాలతో, బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములను గుర్తించి, చట్టపరమైన చర్యల ద్వారా దశలవారీగా పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే పెద్దపల్లె సర్వే నం.937 భూముల సమస్యను చట్టబద్ధంగా పరిష్కరించి దళిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దల విజయ్ సాగర్, రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్ర పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంపై దాడి

**• ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి: సీపీఐ**



**పీలేరు, మన జనప్రగతి, జూలై 20:–** విద్యార్థుల శాంతియుత ఆందోళనలను అణచివేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. జనార్దన్, మంగిరి సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ విమర్శించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎన్‌టీఏలో అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకులు, అవినీతి ఆరోపణలతో విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యా వ్యవస్థపై విశ్వాసం కోల్పోయారని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు నిర్బంధంతో స్పందించడం తగదని విమర్శించారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎన్‌టీఏ వ్యవహారంపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా సాధనకు పట్టు పట్టండి

**• పార్లమెంట్ సభ్యులకు తులసిరెడ్డి సూచన**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 20:–** రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా సాధించేందుకు పార్లమెంట్ సభ్యులు పట్టు పట్టాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి సూచించారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో రాష్ట్రానికి చెందిన సభ్యులు ప్రత్యేకహోదా అమలుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేకహోదా అమలు ద్వారా ఉపాధిహామీ, సర్వశిక్ష అభియాన్ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాలపై కేంద్ర 90 శాతం నిధులు భరిస్తుందన్నారు. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ తదితర విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో అమలవుతున్న పథకాలకు 90–100 శాతం మేర నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమలవుతోందన్నారు. 2014, ఫిబ్రవరి 20న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపి రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మార్చి 1న ప్రత్యేకహోదాపై తీర్మానం చేసి అమలు చేయాలని ప్రణాళిక సంఘాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఆ తర్వాత బిజెపి అధికారంలోకి వస్తే పదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రత్యేకహోదా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం దీనిపై ఛాలెంజ్ గా తీసుకుని ప్రత్యేకహోదా అమలు సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**- శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 20:–** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వీటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ వెల్లడించారు. సోమవారం శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు దేవాలయాల ఆవరణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి ఆర్గనైజేషన్ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకు భగవంతున్ని పాద పద్మములకు సమర్పించే ఒక సాముహిక సేవగా ప్రేమతరు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ నరసింహులు, వెటర్నరీ ఏడి డా.రవీంద్రారెడ్డి, ఏపిఎం గురురాజు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, సేవా సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్, శివకిరణ్, శివరంజని, సునిత తదితరులు పాల్గొన్నారు.

## కొండపేట ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో



**చెన్నూరు మన జనప్రగతి జులై 20:–** చెన్నూరు మండలం లోని కొండపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు, విద్యార్థులకు ఇంచార్జ్ సి.డి.పి.ఓ.వై.గురమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమము మిషన్ వాత్సల్య పథకం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, మిషన్ శక్తి పథకం, బాల్య వివాహాల వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు అంగన్వాడి కార్యకర్తలు మహిళ పోలీసు విద్యార్థులు పాల్గొన్నారు,

## యునాని వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి: డా.జీ. ఫరీదా



**వేంపల్లె మన జనప్రగతి జులై 20:–** ప్రజలు యునాని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డా.జీ. ఫరీదా వెల్లడించారు. సోమవారం స్థానిక ఆర్ఎక్స్ క్లీనిక్ లో ఆధునిక వైద్య విధానాలతో సాంప్రదాయ యునాని వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, కీళు ఎముకల సమస్యలపై యునాని వైద్యం ద్వారా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. హిజామా, జలగల చికిత్సలపై కూడా ప్రత్యేక వైద్య సేవలు ఉన్నట్లు వివరించారు. యునాని వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మిట్టపల్లి హరినవాడకు మౌలికవసతులు కల్పించాలి



**చిట్వేలి మన జనప్రగతి జులై 20:–** చిట్వేలి మండలం సి. కందులవారి పల్లి పంచాయతీ మిట్టపల్లె హరిజనవాడలో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. సామాజిక శంఖారావంలో భాగంగా కెవిపిఎస్, సిఐటియు , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆధ్వర్యంలో హరిజనవాడ లోని సమస్యలపై సర్వే నిర్వహించారు. హరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించకుండా అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు జరుగుతున్నా హరిజనులను రెండో పౌరులుగా చూస్తున్నారని ఆందోళన చెందారు. 450 ఓట్లు ఉన్న హరిజనవాడలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఓటు హక్కును కల్పించాలని కోరారు. స్మశానం లేక ఇబ్బంది పడుతున్నారని, ఉన్న కొద్ది స్థలం కబ్జాకు గురౌతోందని, జీవో 1235 ప్రకారం రెండు ఎకరాలు స్థలం కేటాయించి బోరు, బిల్డింగు ఏర్పాటు చేయాలన్నారు. వీధిలైట్లు లేవని, దళితులు అంధకారంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి దళితులకు ఇవ్వాలన్నారు. తాగునీరు మోటార్ వద్దకు విద్యుత్ సరఫరా లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు వివక్షతకు వ్యతిరేకంగా, హక్కుల కోసం, దశలవారీగా పోరాడడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఓబిలి పెంచలయ్య పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో స్త్రీలపై రోజురోజుకు పెరుగుతున్న నేరాలు

● జిల్లా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, నగరం మహిళా అధ్యక్షురాలు దీప్తి రెడ్డి




**కడప మన జనప్రగతి జూలై 20:–** కూటమి ప్రభుత్వంలో మూడు పువ్వులు ఆరు కాయలు అన్న సామెత ప్రకారం మూడు హత్యలు ఆరు మానభంగాల వలె రాష్ట్రం రావణ కాష్టంగా మారిందని వైయస్సార్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ,నగర మహిళ అధ్యక్షురాలు బండి దీప్తి రెడ్డి లు తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో నీళ్ల బోరు వేసుకుంటుంటే తెలుగుదేశం పార్టీ కార్యకర్త 10000 లంచం ఇవ్వని కారణంగా మనుషులను తెచ్చి కుటుంబంతో కలిసి ఆ మహిళను కొట్టి వివస్త్రం చేశారన్నారు. రైల్వే కోడూరులో వాణి అనే మహిళను నడి రోడ్డుపై కర్రలతో కొడితే ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.చిత్తూరు జిల్లాలో అందురాలపై దాడి చేస్తే చర్యలు ఏవి? బద్వేల్ లో వృద్ధురాలు జాకెట్ చెబితే చర్యలు ఏవి? శక్తి యాప్ నుంచి మహిళలకు రక్షణ జరుగుతుందా వీటన్నిపై హోంమంత్రి అనిత ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. వీటన్నిటిని ప్రశ్నించే వారిపై కేసులు వేయడం చేస్తున్నారే తప్ప మహిళలకు రక్షణ కల్పించలేదన్నారు. ప్రభుత్వంలో నాయకులు బ్యాంకుల్లోనే తమ ఖాతాలను పెంచుకోవడానికి తప్ప ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించలేదని తెలిపారు. వచ్చే రోజుల్లో వైసీ ప్రభుత్వం అనేక ధర్నాలు చేస్తామని ప్రజలలో చైతన్య కల్పించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి తీసుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు రత్నకుమారి, మరియలు. సునీత రెడ్డి, మోక్ష. శారద .ఉమామహేశ్వరి లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ పి. యుగందర్‌కు నక్కలదిన్నె పీహెచ్‌సీ వైద్య బృందం ఘన సన్మానం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 20:–** కడప జిల్లా నూతన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి. యుగందర్ (ఎంబీబీఎస్, ఎంఎస్–ఆర్థో)ను నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో మచిలీపట్నం జిల్లా డీఎంహెచ్‌ఓగా సమర్థవంతమైన సేవలు అందించిన డాక్టర్ యుగందర్ ఇటీవల కడప జిల్లాకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ, డాక్టర్ యుగందర్ నాయకత్వంలో కడప జిల్లాలో ప్రజారోగ్య సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా ఆయన విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కలదిన్నె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. ఓబులేసు, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, డిప్యూటీ హెచ్‌ఈఓ జయప్రకాశ్, సూపర్‌వైజర్ ప్రసాద్‌తో పాటు పీహెచ్‌సీ వైద్య, పారామెడికల్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శివోహం సేవలు ఆదర్శం

రామలింగేశ్వర ఆలయంలో 600 మందికి అన్నప్రసాదం పంపిణీ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 20:–** సేవా భావంతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో భక్తులకు ఉచిత అన్నప్రసాదం పంపిణీ చేశారు.దివంగత సగిలి కేశిరెడ్డి, సగిలి భారతి జ్ఞాపకార్థం వారి కుమారుడు సగిలి మాధవరెడ్డి, కోడలు అనిత సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో సుమారు 600 మంది భక్తులు, ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, శివోహం అన్నప్రసాద సేవా సంఘం గత ఐదేళ్లుగా ప్రతి సోమవారం నిరంతరంగా ఉచిత అన్నప్రసాద సేవ నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో సేవ చేయడం తమకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సమాజానికి మరింత ఉపయోగపడేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు జగన్, విష్ణునారాయణ తదితరులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తూ సేవలందించారు. సేవా కార్యక్రమాన్ని భక్తులు అభినందించారు.

# స్వర్ణాంధ్ర2047 లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి




**కర్నూలు బ్యూరో, మన జనప్రగతి, జూలై 20:–** స్వర్ణాంధ్ర2047 విజన్‌లో భాగంగా జిల్లాలో జీ.వీ.ఏ, జీ.డి.డి.పీ లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు.సోమవారం ఉద్యాన భవనంలో నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి గ్రాస్ వ్యాల్యూ యాడెడ్, గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్, తలసరి ఆదాయం వంటి ఆర్థిక సూచీలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యవసాయం, పర్యాటకం, పరిశ్రమలు, మైనింగ్ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలో ఇప్పటికే సుమారు రూ.90 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 40 ప్రాజెక్టులు కుదిరాయని, వాటి ద్వారా సుమారు 35 వేల మందికి ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. అనంతరం నిపుణులు ఆర్థిక సూచీలు, అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ కలిసిన మాజీ కో-ఆప్షన్,మాజీ కౌన్సిలర్లు

- ఎర్రగుడిపల్లి స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణంపై కమిషనర్ తనూజకు వినతి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 20:–** గ్రూప్ 1సర్వీస్ ద్వారా ఉత్తీర్ణత సాధించి మొదటి పోస్టింగ్ పులివెందుల మున్సిపాలిటీ కమీషనర్ గా బాధ్యతలు చేపట్టిన తనూజా ని మాజీ కో ఆప్షన్ దాసరి చంద్రమౌళి,మాజీ కౌన్సిలర్స్ ఖాదర్ బాషా, రాజశేఖర్ రెడ్డి లు కలిసి పూల బొకే అందించి అభినందించడం జరిగింది, ఈ సందర్భంగా ఎర్రగుడి పల్లి జిల్లా పరిషత్ స్కూల్ కి సంబంధించి ప్రహరీ గోడ నిర్మాణం,పై అంతస్తులో ఇనుప కంచె ఏర్పాటు చేయాలనీ వినతి పత్రం సమర్పించడం తో పాటు వివిధ వార్డ్ లలో ఉన్న సమస్యల గురించి కమీషనర్ దృష్టికి తీసుకెళ్లగా కమీషనర్ సానుకూలంగా స్పందించి త్వరిత గతిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# రాచమల్లు వ్యాఖ్యలు రాజకీయ మనుగడ కోసమే ..: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 20:–** వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకేనని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా విమర్శించారు. సోమవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాచమల్లు ప్రతి రోజూ అధికార పార్టీపై విమర్శలు చేస్తూ, గతంలో చెప్పిన మాటలకు నేడు పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సమర్థిస్తూనే, మరోవైపు గతంలో సీబీఐ, సుప్రీంకోర్టు వంటి వ్యవస్థలను గొప్పవిగా చెప్పారని, అదే సంస్థలు జగన్‌ను ఆర్థిక నేరాల కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తిగా పేర్కొన్న విషయాన్ని మరవకూడదన్నారు.జగన్ అసెంబ్లీకి హాజరుకాకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ఎదుర్కొనే పరిస్థితి లేకనే సభకు రావడం లేదని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని బలమైన నాయకుడిగా ప్రశంసించిన రాచమల్లు, ఇప్పుడు ఆయనపై విమర్శలు చేయడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమన్నారు. కాంట్రాక్టర్ల నుంచి తీసుకునే ఏ రూపంలోని డబ్బైనా లంచమేనని జబీవుల్లా వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై రాచమల్లు చేస్తున్న వ్యాఖ్యలకు వాస్తవాలతో సంబంధం లేదని, రాష్ట్రంలో సంక్షేమం, శాంతిభద్రతలు, పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం మెరుగ్గా ఉన్నాయని అన్నారు. జగనన్న ఇళ్ల అంశం, టీడీపీ జెండాలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు రాచమల్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చారని, అయినప్పటికీ జగన్‌కు వత్తాసు పలుకుతూ మాట్లాడటం మానుకోవాలని సూచించారు.అలాగే వివేకానందరెడ్డి హత్య కేసు, నందం సుబ్బయ్య హత్య కేసులపై ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) నిర్వహించేందుకు సిద్ధమేనా అని రాచమల్లుకు జబీవుల్లా సవాల్ విసిరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గురించి మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

# ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తి సదన్) ను ఆకస్మిక తనిఖీ.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 20:–**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్) ను సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించారు. వన్ స్టాఫ్ సెంటర్లో చేరే వారి వివరాలు వారి రికార్డులను సక్రమంగా మెయింటైన్ చేయాలని అలాగే సంబంధిత అధికారుల సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. బాధితులకు విక్టిమ్ కంపెన్సేషన్ త్వరగా అందేలా కృషి చేయాలని అక్కడికి సిబ్బందిని ఆదేశించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న నివాసితులకు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. వారి భోజన వసతి సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా చట్ట పరమైన సమస్యలు వస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు, తదితరులు పాల్గొనారు.



# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు

**వేంపల్లె మన జనప్రగతి జూలై 20:–** పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డును ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ అఫ్నాన్‌కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగాఅందుకున్నట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలియజేశారు. సోమవారం కడప లోని మాధవి కన్వెన్షన్ లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా 20వేల రూపాయల చెక్కును, మెడల్ను, ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు తెలియజేశారు. తమ విద్యార్థిని సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్ బి ఎస్ రమణా రెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

# నూతన కమిషనర్ శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు



**పులివెందల అర్బన్ మన జనప్రగతి జులై 20:–** పులివెందల నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివ తనూజను స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా మరియు పట్టణ ప్రధాన కార్యదర్శి ఖసిం వల్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు దృశ్యాలు,నోట్‌బుక్కులు మరియు పెన్నులు అందజేసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిషనర్ శివ తనూజ మాట్లాడుతూ పులివెందల పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.పులివెందల ప్రజలకు మేలు జరిగే విధంగా పనిచేస్తానని, పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# చదువుకు అవకాశం లేని పిల్లల సమాచారం తెలపండి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 20:–** చదువుకోవడానికి అవకాశం లేని పిల్లల సమాచారం ఇస్తే వారిని పాఠశాలలో చేర్పించి వారి విద్యకు పునాది వేస్తామని చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిదీన్ తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల ప్రకారం డీఈవో సూచనలు మేరకు మండల విద్యాశాఖ అధికారి–1 ఖాజా మొహిద్దిన్, విద్యాశాఖ అధికారి –2 ఈశ్వరయ్య క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుడు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో సిఆర్ఎంటి చంద్రశేఖర్ గట్టుమీదపల్లిలో ఓ.ఎస్.సి సర్వే నిర్వహించారు. బడి బయట ఉన్నటువంటి ఒంటెల పెంచలమ్మ 8వ తరగతి, ఆవుల శివాని 6వ తరగతి పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను సమీపంలోని చిట్వేలి పీ.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చేర్పించి వారికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు, ప్రజలు మీ ప్రాంతంలో ఎవరైనా బడి వయసు కలిగిన పిల్లలు చదువుకోకుండా గ్రామాలలో ఉంటే వారిని గుర్తించి మీ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించడానికి సిఆర్ఎంటి లకు లేదా ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని కోరారు .అలాంటి పిల్లల భవిష్యత్తుకు పునాది వేయగలరని తెలియజేశారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, బ్యాగ్, బెల్ట్, డిక్షనరీ, తల్లికి వందనం ద్వారా ఆర్థిక సహాయం, రుచికరమైన శుచి, శుభ్రమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు సుహాసిని, గట్టుమీద పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
21 - 07 - 2026

# సెప్టెంబర్ 24,25 తేదీలలో పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర మహాసభలు

**- లోగో ఆవిష్కరించిన ఏరియా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత**




**కడప మన జనప్రగతి జులై 20:–** సెప్టెంబర్ 24,25 తేదీలలో కడప నగరంలో నిర్వహించనున్న పిఆర్ఎస్ వైఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పులివెందుల ఏరియా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత పిలుపునిచ్చారు. సోమవారం పులివెందుల ఎబీసీడబ్ల్యూఓ కార్యాలయంలో ఈ మహాసభల పోస్టర్ / లోగోను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు,నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్ఎస్ వైఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని రాయలసీమతో పాటు వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడంలో ఈ సంఘం చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక ఉద్యమాలను నిర్మించాలని,ఈ రాష్ట్ర మహాసభల ద్వారా విద్యార్థి, యువజన రంగానికి ఉపయోగపడే భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవాలని ఆమె నాయకులకు సూచించారు. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు,రాష్ట్ర నాయకులు పి. వెంకటరమణ,పులివెందుల తాలూకా బీసీ హాస్టల్ వార్డెన్లు వెంకట్ రెడ్డి, ఫరూక్,రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో సమగ్ర నాణ్యత నిర్వహణపై పరిశోధనకు కర్నం భాస్కర్‌కు వైవీయు డాక్టరేట్



**కడప మన జనప్రగతి జులై 20:–** వైయస్సార్ కడప జిల్లాలోని చిన్న ఓరంపాడు గ్రామానికి చెందిన కర్నం భాస్కర్ వైద్య విద్యలో విశిష్ట పరిశోధన చేసి యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (పీహెచ్.డి.) పట్టా విశ్వవిద్యాలయం అధికారులు సోమవారం ప్రకటన జారీ చేశారు , విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగ స్కాలర్ అయిన కర్నం భాస్కర్ " వైద్య విద్యలో సమగ్ర నాణ్యతా నిర్వహణ ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాలలపై ఒక అధ్యయనం " అనే శీర్షికతో ప్రొఫెసర్ టి. శ్రీనివాసులు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో వైద్య కళాశాలల్లో నాయకత్వం, సేవల నాణ్యత, నిరంతర మెరుగుదల, భాగస్వాముల (విద్యార్థులు, అధ్యాపకులు) సంతృప్తి, సంస్థాగత పనితీరు వంటి అంశాలపై సమగ్ర విశ్లేషణ చేసి, వైద్య విద్య నాణ్యతను మరింత మెరుగుపరిచే సూచనలు చేశారు. ఈ పరిశోధన వైద్య విద్యలో నాణ్యతా ప్రమాణాల పెంపునకు దోహదపడుతుందని యూనివర్సిటీ విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పీహెచ్డీ నోటిఫికేషన్ ను వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ కెఎస్వీ కృష్ణారావు విడుదల చేశారు. పరిశోధన లో బాగంగా ఈయన రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితం అయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా పరిశోధనా మార్గదర్శకులు ప్రొఫెసర్ టి. శ్రీనివాసులు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సహచరులు కర్నం భాస్కర్ ను అభినందించారు. తోటి పరిశోధక విద్యార్థులు డిపార్ట్మెంట్ ఉద్యోగులు విద్యార్థులు అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# తుంగభద్ర నీటిపై ఆశలు వద్దు

**ఆరుతడి పంటలే సాగు చేయండి: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

**ఎల్‌నినో ప్రభావంతో ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదు**

**వరి, మిర్చి వంటి దీర్ఘకాలిక పంటలు సాగు చేసి నష్టపోవద్దు**

**వాస్తవాలు చెప్పడం నా బాధ్యత.. రైతులు నష్టపోతే నేనే ఎక్కువ బాధపడతాను**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జులై 20:–** తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) ఆయకట్టు పరిధిలోని రైతులు ఈ ఖరీఫ్‌లో కాలువ నీటిపై ఆధారపడకుండా వర్షపాతంపై సాగయ్యే స్వల్పకాలిక ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. వరి, మిర్చి వంటి దీర్ఘకాలిక పంటలు సాగుచేసి నష్టపోవద్దని హితవు పలికారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన ఆయకట్టుదారుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దాని కారణంగా వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని వివరించారు. ఇదే పరిస్థితి దేశంలో, రాష్ట్రంలో, అనంతపురం జిల్లాలో కూడా కనిపిస్తోందన్నారు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో తుంగభద్ర ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదన్నారు. ఈ పరిస్థితులలో ఆయకట్టు కింద సాగు చేయవద్దని కర్ణాటక ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిందన్నారు. టీబి డ్యామ్ కింద కర్ణాటక ఆంధ్ర ప్రాంతాల్లో దాదాపు 17 లక్షల ఎకరాలు సాగవుతోందని వివరించారు. అయితే ఈ ఏడాది సాగునీటికి తీవ్ర కొరత నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో తుంగభద్ర నీటిపై ఆధారపడకుండా స్థానికంగా లభించే వర్షాధార నీటితో సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాలను తగ్గించవచ్చన్నారు. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, కొన్ని ప్రాంతాల్లో పెసలు, ఉలవలు కూడా సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారని కాలవ తెలిపారు. హెచ్ఎల్‌సీ పరిధిలో జొన్న, మొక్కజొన్న సాగుతో రైతులకు ఇదివరకు అనుభవం ఉందని గుర్తుచేశారు. రైతులు పంటలు సాగు చేసి నష్టపోతే వారి కంటే తనకే ఎక్కువ బాధ ఉంటుందని ఎమ్మెల్యే భావోద్వేగంగా అన్నారు. అందుకే వాస్తవ పరిస్థితులను ముందుగానే రైతులకు వివరిస్తున్నానని, అబద్ధపు హామీలు ఇవ్వటానికి తన మనస్సాక్షి అంగీకరించదన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితిని రైతులందరూ సమిష్టి సహకారంతో ఎదుర్కోవాలని, పదేపదే ఈ విషయాన్ని గుర్తుంచుకుని ఆరుతడి, స్వల్పకాలిక పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం, అధికారులు నిరంతరం కృషి చేస్తారని ఎమ్మెల్యే కాలవ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ మల్లెన్న,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బలరామి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున,ముల్లంగి నారాయణ స్వామి, తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, కేశవ రెడ్డి, పయ్యావుల అనిల్,కేసప్ప, అప్పారావు, చలపతి,దిలీప్ కొత్తపల్లి మహేంద్ర, మల్లీడు సీన,సంగప్ప, నవీన్,హనుమంత రెడ్డి,వై. వెంకటేశులు,తదితరులు పాల్గొన్నారు.

# లింగాల కుడికాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

**● కాలువలో కూర్చుని నిరసన తెలిపిన రైతులు, వైకాపా నాయకులు**



**లింగాల, మన జనప్రగతి జూలై 20:–** మండల పరిధిలోని లింగాల రోడ్డులో ఉన్న కుడి కాలవలో నీటి విడుదల కోసం సోమవారం రైతులు కాలువలో కూర్చుని నిరసన తెలిపారు. వీరికి తోడు వైకాపా నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత 20 రోజులుగా లింగాల కుడికాలువకు నీరు నిలిపివేయడంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగు, తాగునీటి కోసం ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏలినినో సమస్యతో వర్షాలు సరిగా రావని, కరువు కోరలు సాస్తుందని వాతావరణశాఖ శాస్త్రవేత్తలు ఓవైపు చెపుతుంటే, మరోవైపు చిత్రావతి డ్యాములలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ కుడికాలువ అధికారులు మాత్రం తమ స్వార్థపు కమిషన్ల కక్కుర్తి కోసం కాలవలో నీరు సరిగా ప్రవహించలేదని జమ్ము తొలగించే కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే కాలువకు నీరు విడుదల చేయాలని లేదంటే నాలుగు రోజుల్లో సంబంధిత అధికారుల కార్యాలయం వద్ద కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సహకారంతో భారీ ఉద్యమాన్ని చేపడుతామని లింగాల మండల వైకాపా నేతలు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని రైతులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీలేరు గ్రామపంచాయతీకి ఐఎస్ఓ గుర్తింపు

**● పారదర్శక పాలన, నాణ్యమైన పౌర సేవలకు దక్కిన గౌరవం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**పీలేరు మన జనప్రగతి జూలై 20:–** అన్నమయ్య జిల్లాలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి గ్రామపంచాయతీగా పీలేరు నిలిచిందని... ఇందుకు కృషి చేసిన అధికారులను అభినందిస్తున్నా మని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లో పీలేరు గ్రామపంచాయతీకి జారీ చేసిన ఐఎస్ఓ సర్టిఫికెట్లను పీలేరు గ్రామపంచాయతీ డెవలప్మెంట్ అధికారి రవీంద్రారెడ్డికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ పాలన, పారదర్శకత, నాణ్యమైన పౌర సేవలు అందిస్తున్న 23 గ్రామపంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల ఐఎస్ఓ గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు మేజర్ గ్రామపంచాయతీకి కూడా ఐఎస్ఓ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పారదర్శక పాలన, మెరుగైన పరిపాలనా విధానాలు, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు తీసుకున్న చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక చొరవ, వారి సలహాలు సూచనలు పాటించడం వల్ల గ్రామపంచాయతీకి ఈ అరుదైన గుర్తింపు లభించిందని అధికారులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఏ. రాధమ్మ, పీలేరు డిప్యూటీ ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పీలేరు రోడ్డు మార్గంలో 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**● ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు కారు సీజ్**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 20:–** పీలేరు రోడ్డు మార్గంలో కారులో తరలిస్తున్న 11ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారు అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వం లో ఏఆర్ఎస్ఐ కె. మహేశ్వర నాయుడు టీమ్ స్థానిక అటవీ సిబ్బంది జగదీష్, ఆషా బీ లతో కలసి కేవీ పల్లి – పీలేరు మార్గంలో పొంతల చెరువు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున ఒక కారు వేగంగా రాసాగింది. అయితే టాస్క్ ఫోర్స్ టీమ్ ను గమనించిన కారులోని వ్యక్తులు కారును ఆపి, దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకోగలిగారు. కాగా మరో వ్యక్తి పారిపోయాడు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు తమిళనాడు తిరుపత్తూరు, తిరువన్నామలై జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. తరువాత కారును తనిఖీ చేయగా అందులో 11ఎర్రచందనం దుంగలు కనిపించాయి. దుంగలు, కారుతో సహా పట్టుబడిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వారిని డీఎస్పీ వీ. శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. ఈ కేసును సీఐ ఖాదర్ బాషా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జష్ణిక, యశ్వంత్ రెడ్డి, కీర్తనలకు 'సైనింగ్ స్టార్' గౌరవం




**మదనపల్లి, మన జనప్రగతి జూలై 20:–** మదనపల్లిలో నిర్వహించిన "సైనింగ్ స్టార్" కార్యక్రమంలో రాయచోటికి చెందిన వైష్ణవి స్టడీ సెంటర్ విద్యార్థులు ఎం. జష్ణిక, ఎన్. యశ్వంత్ రెడ్డి, జి. కీర్తన ప్రతిభ కనబరిచి 'సైనింగ్ స్టార్' అవార్డుకు ఎంపికై సత్కారం అందుకున్నారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విజేతలకు ప్రశంసాపత్రాలు, రూ.20 వేల విలువైన చెక్కులు, జ్ఞాపిక మెడళ్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆకాంక్షించారు. అవార్డు గ్రహీతలు తమ విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైష్ణవి స్టడీ సెంటర్ యాజమాన్యమే కారణమని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విజయంపై వైష్ణవి స్టడీ సెంటర్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# షైనింగ్ స్టార్స్‌కు కలెక్టర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు.




**కె.వి పల్లి మన జనప్రగతి జూలై 20 :–** పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ పేరుతో నగదు ప్రోత్సాహకం అందిస్తున్న విషయం తెలిసిందే.. అందులో భాగంగా కె.వి పల్లి మండలం నుండి షైనింగ్ స్టార్ నగదు ప్రోత్సాహకాలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో కె.వి పల్లి ఆదర్శ మోడల్ స్కూల్ కు చెందిన ఎస్ గోవర్ధన్ ఎస్ సంజన్ రెడ్డి , ఎం సాయి వైష్ణవి, హరి హరిన్ నాయక్ లు ఎంపికయ్యారు. వీరికి అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి పట్టణంలోని ఎన్.జే.ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం జిల్లా ఇన్చార్జ్ మంత్రి జనార్ధన్, మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ కు ప్రశంస పత్రాలతో పాటుగా ప్రతి విద్యార్థి కి 20 వేల రూపాయలు నగదు బహుమతి మరియు మెడల్ ను బహూకరించారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రమశిక్షణ కఠోర శ్రమతో మరింత ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. కెవి పల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శీను నాయక్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాలాజీ విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు వారు ప్రశంసించారు.

# జీవో 396ను వెంటనే రద్దు చేయాలి

**● పులివెందులలో డాక్యుమెంట్ రైటర్ల నల్ల బ్యాడ్జీల నిరసన**

**● ఈ నెల 31 వరకు పెన్‌డౌన్ సమ్మె**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 20:–** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కడప జిల్లా పులివెందులలో డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చేపట్టారు. పులివెందుల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 20 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పెన్‌డౌన్ సమ్మె కొనసాగుతుందని వారు బహిరంగంగా ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఈ జీవోను వెనక్కి తీసుకుని డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ శాఖలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ ) విధానం అమలులోకి వస్తే సామాన్య ప్రజల ఆస్తులు అన్యాక్రాంతమయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాల్గొన్న నాయకులు ఈ నిరసనలో దస్తావేజు లేఖరి సంఘం అధ్యక్షుడు వి. బసవరాజు, సీనియర్ డాక్యుమెంట్ రైటర్ డీసీబీ ప్రసాద్,డాక్యుమెంట్ రైటర్లు వల్లి,శివ మరియు ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనజనప్రగతి

21 - 07 - 2026

# కలలపై రాజీ పడొద్దు.. లక్ష్యం చేరేవరకు పట్టుదలతో శ్రమించండి

**విద్యార్థులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్.చెరుకూరి**

**సైనింగ్ స్టార్ - 2026 అవార్డు క్రింద ఒక్కొక్కరికీ రూ. 20 వేలు చొప్పున బహుకరణ**

**జిల్లాలో 33 మంది ఇంటర్, 248 మంది టెన్త్ విద్యార్థులకు కలిపి మొత్తం మొత్తం రూ.56,20,000 లు విడుదల**

**కడప మన జనప్రగతి జూలై 20 :–** విద్యార్థులు తమ కలలు, జీవిత లక్ష్యాలపై ఎప్పుడూ రాజీ పడకుండా, అవి నెరవేరే వరకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో.. 2025–26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్–2026 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేల నగదు బహుమతి, సర్టిఫికేట్, మెడల్స్ బహుకరించి.. సత్కారంచే కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, రాష్ట్ర షేక్ డెవెలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ వి.ఎస్. ముక్తియార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి. భానుప్రకాశ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "షైనింగ్ స్టార్స్–2026" అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక్కో ప్రతిభ ఉందని, ఆశయం ఏదైనా కావచ్చని, ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదిగి ప్రపంచ చరిత్రలో మన పేరు లిఖించబడాలి అన్న ఆశయంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం, దృఢ సంకల్పంతో అడుగులేయలన్నారు. ఈ ఆశయ సాధనలో మీరంతా మొదటి మెట్టు ఎక్కరన్నారు. ఈ రోజు విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు రెక్కలు వచ్చిన రోజుగా ఆయన అభివర్ణించారు. మన విజయానికి చేయుతను ఇచ్చిన వారిని భవిష్యత్తులో ఎన్నడూ మారువకూడదన్నారు. మీ లక్ష్యాలను ఎప్పుడు కూడా.. వెనుకంజలో నడిపించకూడదు అని సూచించారు. అదే విధంగా ఈ రోజు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచించి.. పిల్లలో ప్రతిభను వెలికి తీయాలి, వాళ్లని ప్రోత్సహించాలి, వెన్ను తట్టి లేపాలన్ని సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు.సమాజంలో నేడు ఎంతో



పోటీ ఉందని, పిల్లల్లో కూడా ఒక్కొక్కరిలో ఒక్కొక్క రకమైన ప్రతిభ దాగి వుంటుందన్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభీష్టాన్ని గుర్తెరిగి, వారిలోని నైపుణ్యాలను వెన్ను తట్టి లేపి ప్రోత్సహించాలన్నారు. ఒక ఐఏఎస్ అధికారి తొలి ప్రయత్నంలో విఫలమైనా, రెండోసారి మరో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా అక్కడితో ఆగకుండా, తన అసలు లక్ష్యమైన ఐఏఎస్ సాధించేందుకు ఏడాది పాటు ప్రతిరోజూ 15 నుంచి 19 గంటలు కష్టపడి చివరకు విజయం సాధించారని సబ్ కలెక్టర్ భావన ను ఉదాహరణగా వివరించారు. జీవితంలో మధ్యలో లభించే విజయాలతో సంతృప్తి చెందకుండా, అసలు లక్ష్యాన్ని చేరుకునే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.పాఠశాల లేదా కళాశాలలో మొదటి ర్యాంకు సాధించడం విజయమే అయినప్పటికీ, దానినే అంతిమ గమ్యంగా భావించకూడదన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తేనే గొప్ప విజయాలు సాధించగలరని చెప్పారు. ఒకరి విజయం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, వాటి సాధనకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, అనుభవజ్ఞుల సలహాలు తీసుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు సాగాలని చెప్పారు. లక్ష్యాన్ని మనసులోనే దాచుకోకుండా, దాన్ని సాధించేందుకు అవసరమైన సహాయాన్ని తీసుకోవడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదన్నారు."మీ కల మీదే... దానిని నిజం చేయాల్సిన బాధ్యత కూడా మీదే. ఎప్పటికీ ఓటమిని అంగీకరించొద్దు. 'నెవర్ గివ్ అప్' అనే తత్వంతో ముందుకు సాగండి" అని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. "విద్యార్థులే దేశ భవిష్యత్తు. మీ కలలను నిజం చేసుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని జిల్లా కలెక్టర్



ఆకాంక్షించారు.మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిని అనే భావనతో ముందుకు సాగాలన్నారు. మన ఇంటి కోసం, మన సొంతం కోసమే కాకుండా.. మనతో పాటు సమాజం కోసం కూడా పాటుపడుతూ.. దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. మనతో పాటు మన ఇల్లు, మన గ్రామం, మన జిల్లా అనే దృక్పథంతో నడవాలన్నారు. విద్యార్థుల విద్య పరంగా ప్రోత్సాహాన్నే కాకుండా వారి ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను అందుకుంటూ.. దేశానికే స్ఫూర్తిదాయకంగా జిల్లాలో అమలు చేస్తున్న "స్మార్ట్ కిచెన్ వ్యవస్థ" ద్వారా విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన రుచికరమైన మధ్యాహ్నం భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచన్ వ్యవస్థ నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు వారి అభిప్రాయాలను కూడా తెలియజేయాలన్నారు. స్మార్ట్ కిచెన్ ద్వారా అందించే.. మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారి ఆరోగ్యాన్ని మరింత కాపాడుకుంటూ.. వారి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటి వారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే.. మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజంలో ఇంకనూ అభివృద్ధి చెందాల్సిన వారు ఎంతో మంది ఉన్నారని, వారి బంగారు భవిష్యత్తుకు సహకారం అందించాలన్నారు. జిల్లాలో 10వ తరగతి, 12వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్స్ గా అత్యుత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులుగా అవార్డులు అందుకున్న వారు.. భవిష్యత్తులో ఉన్నత విడులతో పాటు, అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆశలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్ర.ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ... షైనింగ్ స్టార్స్ అవార్డులను అమలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారి విద్యకు ఆర్థిక చేయూతను ఇవ్వడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య విధానంలో సమూలమైన మార్పులతో విద్యాభివృద్ధికి దోహదపడుతోందన్నారు.చిన్నప్పటి నుండి కూడా ఇప్పటికే ఎన్నో లక్ష్యాలను ఛేదించి విజయాలను అందుకుని ఉంటారని.. అక్కడక్కడా ఎదురయ్యే ఓటములను గుణపాఠాలుగా గుర్తించి చక్కటి భవిష్య ప్రణాళికతో ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందుకోవాలన్నారు. పాఠశాల విద్య ఆర్జేడీ కె. శ్యామియేలు మాట్లాడుతూ... తల్లిదండ్రులు మనకు అందించిన అవకాశాలను గుర్తెరిగి మన విద్యా, ప్రతిభ ద్వారా వారి గౌరవాన్ని మరింత పెంచేలా విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు, అధికారాలను అధిరోహించాలని విద్యార్థులను కోరారు.ఆర్ఐఓ & డివిఎవో ప్రకాష్ రావు పట్నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మార్కులు ముఖ్యం కాదని, నిరంతర కొత్త విషయాలు నేర్చుకోవడంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, విద్యార్థులు కూడా అలాంటి గుణాన్ని అలవర్చుకుంటే ఏదైనా సాధించగలుగుతామన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల మనస్సును అర్థం చేసుకోవాలన్నారు. మీ లక్ష్యాలను వారిపై రుద్దకుండా వారి యొక్క లక్ష్యాలను సాదించడంలో తోడ్పాటును అందించాలన్నారు. ఏపిసి బి.అనురాధ మాట్లాడుతూ.. మానవతా విలువలను కోల్పోకుండా సమాజాన్ని గౌరవిస్తూ.. సమాజం కోసం, మన తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా... అడుగులేయలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాశాఖ వారికి, అవార్డు పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతిలో 248 మంది, ఇంటర్మీడియట్ లో 33 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 281 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మంజూరైన రూ. 56,20,000 ల మెగా చెక్కును, ప్రశంసా పత్రాలు, మెడల్ లను జిల్లా కలెక్టర్, ముఖ్య అతిధులతో కలిసి.. విద్యార్థులకు అందజేశారు. అంతకుముందుగా షైనింగ్ స్టార్ అవార్డు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో తమ మనోభావాలను పంచుకొని... ప్రతిభ గలిగిన విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించడంతోపాటు, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి పై తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్, నాగయ్య, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 48 గంటల్లోనే భారీ చోరీ కేసు ఛేదన

**పక్కా స్కెచ్‌తో దొంగతనం.. కటకటాల్లోకి ఇద్దరు నిందితులు**

**210 గ్రాముల బంగారం, కేటీఎం బైక్ స్వాధీనం**

**ఎస్పీ ఆదేశాల మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్**


**గాలివీడు మన జనప్రగతి జూలై 20:–** లక్కిరెడ్డిపల్లి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్, ఆదేశాల మేరకు పక్కా వ్యూహంతో, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అరెస్టు చేశారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్.కృష్ణమోహన్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పత్రికా ముఖంగా వెల్లడించారు. బాధితులు కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి గురువారం లక్కిరెడ్డిపల్లి మండలం కోణంపేట సంతకు వెళ్లి, అక్కడే రాత్రి బస చేసి మరుసటి రోజు ఇంటికి రావడం వారి దినచర్య. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 8:30 గంటలకు సంతకు వెళ్లిన దంపతులు, 17వ తేదీ ఉదయం 10:00 గంటలకు గాలివీడులోని తమ ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి షాక్‌కు గురయ్యారు. బీరువాలో భద్రపరిచిన కుటుంబ సభ్యులకు (కుమారుడు, కోడలు, మనవడు, మరదలు, అల్లుడు, భార్య) చెందిన సుమారు 210 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి, వెంటనే గాలివీడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు గాలివీడు పోలీస్ స్టేషన్‌లో కేసు (క్రైమ్ నంబర్ 162/2026) నమోదు చేసి



దర్యాప్తు ప్రారంభించారు. రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.ఆర్.కృష్ణమోహన్ పర్యవేక్షణలో లక్కిరెడ్డిపల్లి సీఐ హెచ్.కృష్ణంరాజు నాయక్ రంగంలోకి దిగారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, 20.07.2026 ఉదయం గాలివీడు మండలం, పేరంపల్లి గ్రామం, రెడ్డివారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన 210 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన (కేటీఎం 125డియుకేఇ) మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో గాలివీడుకు చెందిన డ్రైవర్ చెప్పలి కాశి (24), తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన ఎలక్ట్రీషియన్ మారిశెట్టి సాయికుమార్ (20) ఉన్నారు. ప్రధాన నిందితుడు (ఏ1) కాశికి, బాధితులకు మధ్య ఉన్న కుటుంబ భూవివాదాలే ఈ చోరీకి ప్రధాన కారణం. పాత కక్షను మనసులో పెట్టుకుని బాధితులను ఆర్థికంగా దెబ్బతీయాలన్న ఉద్దేశంతోనే కాశి ఈ చోరీకి పథకం పన్నాడు. అవకాశం కోసం వేచి చూసిన నిందితుడు, బాధితులు గురువారం ఇంట్లో ఉండరనే విషయాన్ని గమనించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. మొదట నేరానికి నిరాకరించిన తన స్నేహితుడైన (ఏ2) సాయికుమార్‌ను కూడా ప్రలోభపెట్టి ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. కేసు నమోదైన 48 గంటల్లోనే సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనితీరుతో నిందితులను పట్టుకున్న లక్కిరెడ్డిపల్లి సీఐ హెచ్.కృష్ణంరాజు నాయక్, గాలివీడు ఎస్సై జె.నరసింహారెడ్డి, మరియు వారి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్, ప్రత్యేకంగా అభినందించారు.

# అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యత ప్రామాణికంగా సమస్యలు పరిష్కారం చేయాలి

**● జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**అన్నమయ్య జిల్లా మన జనప్రగతి జూలై 20:** –జాప్యం లేకుండా పిజిఆర్ఎస్ సమస్యలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి, సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్–ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 324 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174